కథ

కె.రాజేశ్వరి

# మానవ నైజం

"ఏమండోయ్! మీ ఫ్రెండ్ శ్రీనివాస్‌ని మర్చిపోయినట్లున్నారు"

"మర్చిపోలేదులే.. వాడిప్పుడు ఏదో ట్రైనింగ్ కోసం కంపెనీ తరఫున యు.ఎస్.వెళ్లాడట"

"మా బాబాయిగారి అమ్మాయి దీప్తి వాళ్లు కూడా ఢిల్లీ నుండి వచ్చేశారట. ఇప్పుడు హైదరాబాద్‌లోనే ఉంటున్నారట. లిస్ట్‌లో దాని పేరు కూడా రాయండి" పాపకి సిర్లాక్ పెట్టడం పూర్తవ్వటంతో మూతి తుడిచి బెడ్ మీద పడుకోబెట్టింది. పెళ్లయిన ఐదేళ్లకి లేకలేక పుట్టిన పాప కావటంతో అన్నప్రాసన చాలా గ్రాండ్‌గా చేయాలని అందర్నీ గుర్తుచేసుకుంటూ ఓ లిస్టు తయారు చేసుకుంటున్నారు.

"అబ్బా... పాప అన్నప్రాసనకి ఇంకా నెల రోజులు టైముంది. అందర్నీ పిలుద్దాం కానీ ఇప్పటి నుండే నన్ను టెన్షన్ పెట్టకు"

బెడ్ మీద కూర్చుని లాప్‌టాప్‌లో ఏదో వర్కు చేసుకుంటున్న జగన్ విసుక్కున్నాడు.

"పాపని కాస్త చూస్తుండండి. ఈ గిన్నెలు కడిగి లోపల పెట్టి వస్తాను" అంటూ హాల్లోకి వచ్చిందల్లా కెవ్వున అరిచింది.

"ఏమిటి రజనీ ఏమైంది?" చేస్తున్న పని ఆపి ఆదుర్దాగా అడిగాడు.

"ఏమండీ నీళ్లు.. నీళ్లు.. ఇంట్లోకే వచ్చేస్తున్నాయి"

"ఏమిటి ఎక్కడన్నా టాప్ లీకయిందా ఏమిటి?" అంటూ మంచం దిగబోతున్న వాడల్లా అప్పటికే బెడ్ రూంలోకి కూడా నీళ్లు రావటంతో బిత్తరపోయాడు. ఏం జరిగిందో అర్థం కాక కిటికీలో నుండి బయటకి చూశాడు. చుట్టుపక్కల ఇళ్ల చుట్టూ నీళ్లు చేరటం జనమంతా గోలగోలగా పరుగులు తీయటం చూసి గబుక్కున కిటికీ మూసేసి "రజనీ! పాపని తీసుకొని పైకి వెళ్లు" అంటూ పాపని రజని చేతికిచ్చి లాప్‌టాప్ తీసి బీరువాలో పెట్టి తలుపులన్నీ వేసి ఇంటికి తాళం పెట్టాడు. మెట్ల మీదగా పైకి వెళుతూ అప్పుడు గమనించాడు చుట్టుపక్కల ఇళ్లన్నీ సగానికి పైగా మునిగిపోవటం. ఇంకా నయం... తనిల్లు కాస్త మెరక మీద ఉంది అనుకుంటూ భార్య దగ్గరికి వెళ్లాడు.

ఉధృతంగా ప్రవహించే నీటి ప్రవాహం వలన క్షణక్షణానికి నీటి మట్టం పెరిగిపోయి ఇళ్లన్నీ చూస్తుండగానే మునిగిపోయాయి. జనమంతా హాహాకారాలు చేస్తూ ఇళ్లమీదకి ఎక్కి కూర్చున్నారు.

"ఏమిటండీ ఇది.. ఏం జరిగింది? ఎక్కడి నుండి వస్తున్నాయి ఇన్ని నీళ్లు? చూస్తుంటేనే భయం వేస్తుంది" పాపని గుండెలకదుముకొంటూ చుట్టూ సముద్రాన్ని తలపిస్తున్న ఆ వాతావరణాన్ని చూసి భయంగా అన్నది.

"ఏం జరిగినా ధైర్యంగా ఉండటం తప్ప చేసేదేముంది" అంటూ జేబులో నుండి సెల్ ఫోన్ తీసుకొని ఎవరెవరివో నెంబర్లు ప్రెస్ చేశాడు.

"షిట్.. ఒక్క ఫోన్‌లో లైన్ కలవటం లేదు" విసుగ్గా అంటూ కాళ్ల కింద చల్లగా తగలటంతో- "రజనీ! మనిల్లు కూడా మునిగిపోయింది. డాబా మీదికి కూడా నీళ్లొచ్చాయి. చూస్తుంటే ఏదో ప్రళయం ముంచుకొచ్చినట్లే ఉంది. పాపని నా చేతికిచ్చి నువ్వా నిచ్చెనెక్కి టాంక్ మీదికి ఎక్కు" అంటూ పాపని తీసుకున్నాడు. తను కూడా భార్య వెనకాలే టాంక్ మీదికి చేరుకున్నాడు.

"ఏమండీ! మనిల్లు, ఇంట్లో సామాను అంతా మునిగిపోయింది కదండీ" ఏడ్చేసింది రజని.

"ఇంటి సంగతి తర్వాత.. ఇది కూడా మునిగిపోయిందంటే మన పరిస్థితేమిటో ఆలోచించు. నీటిమట్టం క్షణక్షణానికి పెరుగుతుందే కానీ తగ్గటం లేదు. ఈ పెరగటం ఎంతవరకు పోతుందో ఏమో. అసలు మనం ఇక్కడి నుండి బయట పడే దారే లేదా.. మా బ్రతుకులు ఇలాగే అంతమవ్వాల్సిందేనా.. నిస్సహాయంగా జుట్టు పీక్కున్నాడు.

దూరంగా ఆశాకిరణంలా ఓ పడవ కనిపించటంతో ప్రాణం లేచి వచ్చినట్లయింది. "ప్లీజ్.. రక్షించండి.. హెల్ప్.. హెల్ప్" అంటూ చేతులూపుతూ గొంతు చించుకొని అరిచాడు.

జగన్ కేకలు విని పడవని వీళ్లకి దగ్గరగా తీసుకొచ్చి "రండమ్మా! ఎక్కండి" అంటూ చేతులు అందించారు పడవలోని వాళ్లు.

"అమ్మో... నాకు భయం"

రజని మాటలకి నవ్వి "భయం లేదమ్మా.. అందర్నీ కాలేజీ దగ్గరకి చేరుస్తున్నాము. అక్కడైతే అందరం ఒకరికొకరు తోడుగా ఉంటాం. ఇక్కడ మీరిద్దరే ఈ పసిదానితో ఎంతసేపని ఉండగలరు. ఇప్పటికే నీళ్లు మీ టాంక్‌ని తాకుతున్నాయి. అది కూడా మునిగిందంటే ఏమైపోతారు. ఎక్కడుంటారు?"

అప్పుడు కానీ అర్థంకాలేదు రజనీకి తమ పరిస్థితి. గబగబా పాపని భర్త చేతికిచ్చి పడవలోని వాళ్ల సాయంతో పడవెక్కి కూర్చుని పాపని అందుకుంది. జగన్ కూడా నెమ్మదిగా పడవలోకి చేరాడు.

అంత పెద్ద ప్రవాహంలో అటు ఇటు ఊగుతూ

ప్రాణాలతో బయటపడతామో లేదో"


చుట్టూ ఉన్న వాతావరణం చూస్తుంటే జగన్‌లో కూడా ధైర్యం సన్నగిల్లుతోంది.

ఇంతలో నిద్రపోతున్న పాప లేచి ఒక్కసారిగా ఏడుపు లంకించుకుంది. అప్పుడు కానీ గుర్తు రాలేదు వాళ్లకి పాప ఆకలి గురించి.

"మనమెలాగో ఒకటి రెండు రోజులైనా ఆకలికి తట్టుకోగలం. ఈ పసిదాని సంగతేమిటండి?" ఏడుపు గొంతుతో అడిగింది.

ఓ పక్క పాప ఆకలి ఏడుపు.. మరో పక్క దాని ఆకలి తీర్చలేని రజని నిస్సహాయ స్థితి.. పైన ఎండ మండిపోతుంది.. కింద చుట్టూ నీళ్లు.. ఎటు వెళ్లటానికి ఏమి చేయటానికి వీలులేని పరిస్థితి. భగవంతుడా..

**ఆంధ్రభూమి దినపత్రిక కథల పోటీలో ఎంపికైన కథ**



పడవ ప్రయాణిస్తుంటే నడిసముద్రంలో ఉన్నట్లుంది. ఏ క్షణంలో పడవ మునుగుతుందోనని భయమేసి 'భగవంతుడా! నీవే దిక్కు' అనుకుంటూ గట్టిగా కళ్లు మూసుకుంది.

పడవ ఎంతసేపు ప్రయాణించిందో కూడా తెలీదు. ఒక్కసారిగా కుదిపినట్లనిపించి కళ్లు తెరిచింది. ఎదురుగా నాలుగంతస్తుల ఇంజనీరింగ్ కాలేజి.. మొదటి రెండంతస్తులు నీళ్లలో మునిగిపోగా మూడు, నాలుగు అంతస్తుల్లో జనం నిండి ఉన్నారు. అంతమంది జనాన్ని చూడగానే ప్రాణం లేచివచ్చినట్లనిపించింది. అప్పటి వరకు పడిన టెన్షన్ అంతా తగ్గి కాస్త రిలీఫ్‌గా ఫీలవుతూ నెమ్మదిగా పడవ దిగింది. కాస్త ఖాళీగా ఉన్న చోటు చూసుకొని ఏడ్చిఏడ్చి నిద్రపోతున్న పాపని గుండెలకి హత్తుకొని గోడకి జారగిలబడి కళ్లు మూసుకొని కూర్చుండిపోయింది. కాసేపాగి నెమ్మదిగా కళ్లు తెరిచి చుట్టూ ఉన్న జనాన్ని పరికించి చూసింది.

అంతా కాయకష్టం చేసుకొని బ్రతికే వాళ్లలా ఉన్నారు. గోలగోలగా ఏదేదో మాట్లాడుకుంటున్నారు. దగ్గర్లో పసిపిల్లవాడి ఏడుపు వినిపించి అటు చూసింది.

సరిగ్గా సంవత్సరం కూడా ఉండదేమో ఒంటి మీద చిన్న చొక్కా తప్ప నిక్కరు కూడా లేకుండా ఏడుస్తూ అటుఇటు పాకుతున్నాడు. వాడి తల్లి కాబోలు చామన చాయ రంగుతో ముతక చీరలో ఉన్నామె "అరేయ్! అట్టా ఎల్లమాకరా.. జనం తొక్కేత్తారు" అంటూ వాడిని లాగి బలవంతాన ఎత్తుకుంది.

తన గుండెల మీద రెండు చేతులతో తడుముతూ ఏడుస్తున్న వాడ్ని చూసి "నా బిడ్డే.. ఆకలేసిందా" అంటూ వాడ్ని ఒళ్లో వేసుకొని చెంగు అడ్డుపెట్టుకొని పాలివ్వసాగింది.

వాడి ఏడుపుకో, జనం గోలకో కానీ అప్పటివరకు ఏడ్చి ఏడ్చి నిద్రపోతున్న పాప ఒక్కసారిగా ఏడుపు లంకించుకుంది.

పాప ఎందుకేడుస్తుందో తెలిసిన రజనికి ఏం చేయాలో పాలుపోలేదు. పాపని ఎలా ఓదార్చాలో అర్థంకాక తల్లడిల్లిపోయింది. పాపకి ఆహారం ఇచ్చి అప్పటికి ఐదారుగంటలు పైనే అయింది. ఇంకా ఎంతసేపని ఆ పసిది ఆకలిబాధని తట్టుకోగలదు. అసలు.. దాని ఆకలి తీరే దారేది? భగవంతుడా...ఏమిటయ్యా ఈ పరీక్ష?

గుండెలోని వేదనంతా కరిగి కనుకొనల్లో కన్నీరుగా మారగా బాధతో కళ్లు మూసుకుంది.

"ఏంటమ్మా! బిడ్డట్టా గుక్కపట్టి ఏడుస్తుంటే ఉలుకు, పలుకు లేకుండా అట్టా కూచున్నావు? కొంపదీసి ఈ బిడ్డ నీ బిడ్డ కాదా ఏటి?" ఆ పసివాడి తల్లి మాటలకి కనుకొనల్లో నిలిచిన నీరు చెంపల మీదుగా జలజలా కారాయి.

"ఏంటమ్మా ఎందుకేడుస్తున్నావు?"

ఇదంతా చూస్తున్న జగన్ భార్య చేతుల్లో నుండి ఏడుస్తున్న పాపని తీసుకున్నాడు. ఎంతగా సముదాయించాలని ప్రయత్నించినా అంతకంతకు పాప ఏడుపు ఎక్కువై గొంతు కూడా బొంగురుపోయింది.

"బిడ్డకి ఆకలేసి ఏడుస్తున్నట్టుంది. మీరట్టా ఎంతసేపు ఆడించినా బిడ్డ ఆకలి తీరిద్దా ఏటి.. కడుపునిండా పాలు పట్టాలి కాని.." రజనీని, జగన్‌ని మార్చి మార్చి చూస్తూ అన్నదామె.

"ఆ పాలే... ఆ పాలే ఇప్పుడు ఎక్కడ దొరుకుతాయమ్మా... ఆ సంగతి తెలీకే కన్నబిడ్డ అట్లా ఆకలితో

అలమటిస్తుంటే చేతకాక ఏడుస్తూ కూర్చున్నాను" రెండు చేతుల్లో మొహం దాచుకొని భోరున ఏడ్చింది రజని.

"పాలు దొరికేదేమిటమ్మా! కన్నతల్లినంటావు. బిడ్డని ఒళ్లో వేసుకొని పాలివ్వమ్మా" 'అది కూడా చెప్పాలా' అన్నట్లు చూసిందామె.

"అది పుట్టినప్పటి నుండి దానికి డబ్బా పాలేనమ్మా. నాకు... నాకు పాలు పడలేదు. వరదనీళ్లని చూసిన హడావుడిలో దాని పాలడబ్బా, సీసా తీసుకురావటం మర్చిపోయాను. ఇప్పుడు దాని ఆకలి ఎట్లా తీర్చాలో అర్థం కావటం లేదు. లేక లేక పుట్టిన బిడ్డ... ఆకలికి తట్టుకోలేక ఏడ్చిఏడ్చి గొంతు ఎండి ఏమైపోతుందో ఏమో" దుఃఖం ముంచుకు రాగా పమిట చెంగుని నోట్లో కుక్కుకుంది.

ఒక్క క్షణం రజనీ వైపు, జగన్ చేతిలో ఆకలికి అల్లాడిపోతున్న పసిపిల్ల వైపు చూసింది. పాలు తాగుతూ పొత్తిళ్లల్లో నిద్రపోతున్న తన కొడుకుని తీసి పక్కనే నేల మీద పడుకో బెట్టింది. నెమ్మదిగా లేచి జగన్ చేతిలో గుక్క పట్టి ఏడుస్తున్న పాపని లాక్కుని ఒళ్లో వేసుకుని కూర్చుని రెండోవైపు స్తన్యాన్ని పాప నోటికందించింది.

అప్పటివరకు ఆకలిబాధతో గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్న ఆ పసిది నోటికి పాలు తగలటంతో ఏడుపు ఆపేసి ఆబగా పాలు తాగసాగింది.

ఒక్కసారిగా పాప ఏడుపు ఆగిపోవటంతో భయంతో తలెత్తి చూసిన రజని, జగన్‌లిద్దరూ ఆ దృశ్యాన్ని చూసి బిత్తరపోయారు. ఏం మాట్లాడాలో అర్థం కాక మూగవాళ్లలా చూస్తుండి పోయారు.

కడుపు నిండా పాలు తాగి బోసినోటితో నవ్వుతూ కేరింతలు కొడుతున్న పాపని బొమ్మలా కూర్చుండిపోయిన రజని చేతికిచ్చి "బిడ్డ ఏడుపు...నీ బాధ చూసి తట్టుకోలేకపోయానమ్మా. మీలాగ సదూకున్నదాన్ని కాదు. కష్టం చేసుకొని బతికేవాళ్లం.. నే చేసింది తప్పో ఒప్పో తెలీదు. తప్పైతే చమించండమ్మా" అన్నది.

ఆమె ఔదార్యానికి మాటలు రాక కన్నీళ్లతో రెండు చేతులు ఎత్తి నమస్కరించింది.

"అదేంటమ్మా మీరు గొప్పోరు. మీరు నాకు దణ్ణం పెట్టటం బాలేదు"

"నీ పేరేంటో తెలియదు కానీ నా బిడ్డ ప్రాణాలు నిలబెట్టావు. ఏమిచ్చినా నీ ఋణం తీర్చుకోలేము"

"అంతలేసి పెద్ద మాటలెందుకమ్మా. నన్ను ముత్తాలంటారు. ఐనా... కష్టాల్లో ఉన్నప్పుడు ఒకళ్లకొకళ్లం సాయం చేసుకోపోతే మడుసులకి పశువులకి తేడా ఏంటుంటుందమ్మా"

'చదువుకోపోయినా ఎంత గొప్పగా చెప్పింది. ఎంత మంచి మనసు' ముత్యాల్ని చూసి మనసులోనే జోహార్లర్పించాడు జగన్.

మెల్లమెల్లగా చీకట్లు ముసురుకున్నాయి. అందరికీ ఆకలేస్తున్నా చుట్టూ ఉన్న వరద ఉధృతి కలిగించే భయం ఆ బాధని మర్చిపోయేలా చేస్తుంది. అందరూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈ రాత్రికి వరద ఉధృతి ఇంకా పెరిగిందంటే ఎక్కడ తలదాచుకోవాలా అని భయం భయంగా బిక్కుబిక్కుమంటూ చూస్తూ కూర్చున్నారు. పవర్ స్టేషన్స్ కూడా మునిగిపోవటంతో కరెంటు కూడా లేక అంతటా అంధకారం అలుముకుంది. ఆకాశంలోని చంద్రుడు, చుక్కల వలన వచ్చే వెలుతురు తప్ప ఎక్కడా వెలుగన్నది లేదు. చుట్టూ నీళ్లు ఉండటంతో విపరీతమైన చలిగా ఉంది. అందరూ కట్టు బట్టలతో బయటపడటంతో చలికి వణుకుతూ ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూస్తూ గడిపారు.

కాసేపు ఆడి నెమ్మదిగా నిద్రలోకి జారుకున్న పాపని గుండెలకి హత్తుకొని చలిగాలి తగలకుండా తన చీర చెంగుని పాపచుట్టూ కప్పింది రజని.

ఎంతో భారంగా అతికష్టంగా ఆ రాత్రి గడిచింది.

తూర్పు దిక్కున ఉదయ భానుడిని చూడగానే అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. ఆ రాత్రి ఎటువంటి ఘోరం జరగకుండా వరద నిలకడగా ఉండటంతో గండం గడిచిందనుకున్నారే కానీ అసలు బాధ ముందున్నదని గ్రహించలేకపోయారు.

చిన్నపిల్లలతోపాటు పెద్దవాళ్లకి కూడా ఆకలి బాధేమిటో అర్థమవ్వసాగింది. కాసిని నీళ్లైనా తాగి ఆ బాధని కొంతవరకైనా తగ్గించుకుందామనుకుంటే చుట్టూ కావల్సినన్ని నీళ్లున్నా తాగటానికి గుక్కెడు మంచినీళ్లు ఎక్కడా లేవు. మలమూత్రాలకైతే కాలేజీలో ఉన్న బాత్‌రూంలని వాడుకున్నారు కానీ ఆకలి బాధ తీరేదెలా?

మళ్లీ పిల్లలిద్దరూ ఆకలికి ఏడుపు లంకించుకుంటే ముత్యాలు చెరికాసిని పాలిచ్చింది.

"నీ పిల్లాడికి కడుపు నిండా పాలివ్వకుండా నా బిడ్డ ప్రాణాలు నిలబెడుతున్నావు. భగవంతుడు ఎక్కడో లేడు ముత్యాలూ!" కృతజ్ఞతగా ముత్యాలు రెండు చేతులు పట్టుకుంది.

'కానీ.. కానీ.. ఆహారం లేకపోతే ముత్యాలకైనా పాలు ఎంతకని స్రవిస్తాయి' ఈ ఆలోచన రావటంతో రజనీకి భయం పట్టుకుంది. ఎవరినైనా హెల్ప్ అడిగి ఇక్కడి నుండి ఏదో విధంగా బయటపడాలని జగన్ ఫోన్ తీసుకొని ఎంతగా ప్రయత్నించినా లైన్ కలవటం లేదు. చుట్టుపక్కల ఊళ్లన్నీ జలమయం కావటంతో కమ్యూనికేషన్ ఫెయిల్ అవటమే కాక ట్రాన్స్‌పోర్టు కూడా లేకుండా పోయింది.

కాసేపటికి కాలేజీ బిల్డింగుపైన హెలికాప్టర్ ఎగరటం, దాన్లో నుండి ఏవో పొట్లాలు కిందికి జారటం

## మొహమాటం లేని కత్రినా



కత్రినా కైఫ్ కెరీర్‌కి 'వెల్కమ్', 'సింగ్ ఈజ్ కింగ్' సినిమాలు చాలా మేలు చేశాయి. అలాంటి రెండు హిట్ చిత్రాలు ఆమెకందించిన దర్శకుడు అనీస్ బాజ్మీ తన కొత్త చిత్రం 'థాంక్యూ' కోసం మళ్లీ కత్రినాని నటించమని అడిగితే- ఏమాత్రం మొహమాటపడకుండా ఆ సినిమాని తిరస్కరించిందిట కత్రినా. ఏమని అంటే- కాల్షీట్ల సమస్య అని సింపుల్‌గా చెప్పడంతో అనీస్ బాజ్మీ బోల్డు బాధపడిపోయాట్ట. డేట్ల సమస్య అయితే కాస్త అటూ ఇటూ ఎలాగోలా మేనేజ్ చేయమంటే పోయేది కానీ, మరీ ఇలా ఇంత నిర్మొహమాటంగా సినిమా తిరగ్గొడుతుందా అని వాపోతున్నాడు.

చూసి.. "ఓలమ్మో... ఓలమ్మో... అన్నం పొట్లాలట్టుంది" అనుకొంటూ అందరూ ఒక్కసారిగా తీసుకుంటూ నాలుగో అంతస్తుపైకి పరిగెత్తారు.

ఆకలి బాధ తట్టుకోలేక పోతుంది రజని. అయినా వాళ్లతో పాటు తోసుకుంటూ వెళ్లి ఆహారం పాకెట్లు తెచ్చుకోవాలంటే అభిమానం అడ్డొచ్చి బేలగా భర్తవైపు చూసింది.

భార్య బాధ అర్థం చేసుకొని తనదీ అదే పరిస్థితి కావటంతో తన ఇంజనీరు హోదాని కాసేపు మరిచి తప్పనిసరై వాళ్ల వెనకే వెళ్లాడు. ఒక్క పులిహోర పాకెట్టు కంటే దొరక్కపోవటంతో మొహం వేలాడేసుకొని వచ్చిన భర్తని చూసి "పర్లేదులెండి... సర్దుకుందాం" అన్నది.

ఇంతలో కొడుకుని చంకలో ఎత్తుకొని పమిటచెంగులో రెండు పులిహోర పాకెట్లు, రెండు పెరుగన్నం పాకెట్లు, నాలుగు వాటర్ పాకెట్లు తీసుకొచ్చి "ఇదుగో నమ్మా... పసిపిల్లలతో మీరు యాడొత్తార్లే అని నేనే తెచ్చా.." అంటూ ఒక పులిహోర పాకెట్టు, ఒక పెరుగన్నం పాకెట్టు రెండు వాటర్ పాకెట్లు తీసిచ్చి "తినండమ్మా" అన్నది.

పెరుగన్నం పాకెట్ తీసుకొని "ఇది నువ్వుంచుకో ముత్యాలూ! ఆకలేసినప్పుడు తర్వాత తిందువు. ఇద్దరు పిల్లలకి పాలిస్తున్నావు. పాలిచ్చే తల్లికి ఆకలెక్కువంటారు" అన్నది రజని.

"మా చంటోడికి పది నెల్లు నిండాయమ్మా. కాస్త అన్నం తినిపిత్తాలే. కడుపు నిండితే వాడు పాల కోసం ఏడవడు. అప్పుడు మీ బిడ్డకి కడుపు నిండా పాలిత్తాను" ముత్యాలు మాటలకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఏ జన్మలో బంధమో ఇది.. ఎన్ని జన్మలెత్తినా నీ ఋణం తీర్చుకోలేము ముత్యాలూ! అనుకుంది మనసులో.

ఏసీ గదుల్లో కూర్చుని చికెన్ బిర్యానీలు, ఫ్రైడ్ రైస్‌లు, పుల్కాల లాంటి కాస్ట్లీ ఫుడ్‌కి అలవాటు పడిన జగన్, రజనీలకి ఇలా కూలీ జనం మధ్య కూర్చుని ఎప్పుడో వండిన పులిహోర, పెరుగన్నం తినాలంటే చాలా కష్టంగానే ఉంది. ఆత్మారాముడ్ని శాంతింపచేయాలంటే ఏదో ఒకటి తినక తప్పదు కదా.

ప్రకృతి తలుచుకుంటే క్షణాల్లో ఎంతటి వాళ్లని ఎంతలా మార్చుతుంది?

పాప డైపర్ నుండి స్మెల్ రావటంతో బాత్‌రూంకి తీసికెళ్లి శుభ్రంగా కడిగి తుడవటానికి ఏమీలేక పమిట చెంగుతో తుడిచి చెంగు కప్పి తీసుకొచ్చింది.

"ఏమండీ! మీ దగ్గర కర్చీఫ్ ఉందా?" భర్తనడిగింది.

"లేదు రజనీ! ఇప్పుడు కర్చీఫ్ ఎందుకు?"

"పాపకి డైపర్ పాడయితే తీసేశాను. వేరే డైపర్స్ లేవుకదా. కనీసం కర్చీఫ్ అన్నా ఉంటే కడదామని. ఇప్పటికే పిల్లల యూరిన్‌తో ఇక్కడంతా వాసనగా ఉంది. ఇక రెండోది కూడా చేశారంటే ఈమాత్రం కూడా ఉండలేము"

రజని సమస్య అర్థమైన ముత్యాలు కాసేపు ఏదో ఆలోచించి గబగబా తన పైట చెంగుని ఓ గజం మేర బరబరా చింపేసింది. దాన్ని మళ్లీ నాలుగు ముక్కలుగా చేసి రెండు తనుంచుకుని "ఇవిగోనమ్మా! మడిచి పిల్లకి గోచీలాగ పెట్టు" అంటూ రెండు ముక్కలు రజనీ చేతికిచ్చింది.


ఆమె ఆలోచనకి, నిస్వార్థబుద్ధికి నివ్వెరపోయింది రజని.

ఏ.సి. గదుల్లో పట్టుపరుపుల మీద పడుకొని కాస్ట్లీ డైపర్స్ వేసుకునే తన ఒక్కగానొక్క బిడ్డకి ఇలా కూలి చేసుకొని బతికే ఓ తల్లి చింకిపాతచీర గతైందేమిటా.. అని ఒక్క క్షణం బాధపడింది. ఎంత దారుణమైన పరిస్థితి... కల్లో కూడా ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఊహించలేదు. ఇంకా నయం... ఓ దేవతలా సమయానికి పాపకి ఆకలి తీర్చటమే కాక ఒళ్లు కప్పుకోవటానికి తన ఒంటిమీదున్న చీరనే చింపి ఇచ్చింది.

ఇదే పరిస్థితిలో ముత్యాలే కనక ఉండి ఉంటే నేనసలు తన ముఖం కూడా చూసే దాన్నేనా... తనిచ్చినట్లుగా ముత్యాలు బిడ్డకి నేను పాలివ్వగలిగేదాన్నేనా? నా అహంకారం... డబ్బు...హోదా... ఎన్ని అడ్డొచ్చేవో కదా...

"ఏంటమ్మా ఆలోచిస్తున్నావు? బాబుగారు, మీరు బిడ్డని కిందకి దింపకుండా ఆడిస్తుంటిరి. మీ బట్టలు పాడయితే మార్చుకోవటానికి వేరే బట్టలు కూడా లేవు కదా. బిడ్డకి గోచీ పెట్టమ్మా" ముత్యాలు మాటలకి ఈ లోకంలోకి వచ్చింది.

పాపకి ఆకలేసినప్పుడల్లా పాలిస్తూ, ఒక్కోసారి పాలు తాగుతూ పాప టాయిలెట్‌కెళ్తే చీదరించుకోకుండా తనే బాత్‌రూంకి తీసికెళ్లి కడిగి ఆ గుడ్డని నీళ్లల్లో జాడించి తెచ్చి నేలమీద ఆరేసేది. ఇలా మూడు రాత్రులు, మూడు పగళ్లు కంటిమీద కునుకు లేకుండా అర్థాకలితో, కట్టుబట్టలతో దుర్భర జీవితాన్ని గడిపారు. నాలుగో రోజు వరద ఉధృతి కాస్త తగ్గటంతో ప్రభుత్వం



పంపిన సహాయక బృందాల సహకారంతో ఎవరి బంధువుల ఇళ్లకి వాళ్లు వెళ్లిపోయారు.

రెండు నెలల తర్వాత...

"అమ్మగోరూ... అమ్మగోరూ"

బయటి నుండి ఎవరో పిలవటం విని తలుపు తీసింది రజని.

"మీరా అమ్మా! మీ ఇల్లనుకోలేదు. పాప బావుందదా అమ్మా?" చంకలో పసివాడితో, చింకిచీర కట్టుకొని పట్టలేని సంతోషంగా పలకరిస్తున్న ముత్యాలుని చూసి ఒక్క క్షణం మొహం చిట్లించింది.

"నేనమ్మా... ముత్తాలుని... మర్చిపోనారా?"

"లేదులే ముత్యాలూ! ఎట్లా ఉన్నావు?" ఎందుకొచ్చిందోనని లోలోపల భయపడుతూ అడిగింది.

"బానే ఉన్నానమ్మా. మీరెట్టా ఉండారు?"

"బాగానే ఉన్నాం. ఇల్లంతా వరదలో మునిగిపోయిందిగా. బట్టలు, మంచాలు, పరుపులు, టీవీలతో పాటు బియ్యం, పప్పులు, ఉప్పులు అన్నీ తడిసిపోయాయి. ఇల్లంతా బురదమయం. ఆఖరికి బీరువాలోని బట్టలు కూడా బురదకొట్టుకుపోయాయి. నిన్నటి దాకా అన్నీ శుభ్రం చేసుకోవటంతోనే సరిపోయింది. ఏం చేస్తాం తప్పదుగా మరి. అవునూ... మా ఇల్లెట్లా తెలిసింది?"

"మీ ఇల్లని తెలీదమ్మా... ఈడ పొలాలన్నీ ఇసకమేటేసిపోనాయి. చేసుకోటానికి ఏ పనీ లేకపోవటంతో వరదకి ముందెల్లినాడు కాస్తా పట్నంలోనే ఉండిపోనాడు. ఆడక్కడ ఏదైనా పని చూసుకున్నాక నన్ను తీసికెళ్తాడట. అందాక ఏదైనా పనుంటే చేసుకుందామని అందరిళ్లల్లో అడుగుతూ ఇట్టా వచ్చాను. ఏదోటి చేసి కడుపు నింపుకోవాలి కదమ్మా. మీ ఇంట్లో ఏదైనా పనుంటే చెప్పమ్మా. డబ్బులొద్దు. రెండు పూటలా ఇంత ముద్ద పెడితేసాలు. పాపని చూసుకుంటూ ఈడనే ఉండమన్నా ఉంటాను. లేదంటే గుళ్లో పడుకొని రెండుపూటలా పన్లోకొత్తాను. ఇల్లు కూడా వరదకి కొట్టుకుపోయిందమ్మా" జాలిగా మొహం పెట్టి ఆశగా అడిగింది.

"ఎవరు రజనీ?" అంటున్న భర్త మాటలు విని "పాప లేచినట్లుంది ఉండు ముత్యాలూ ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికెళ్లింది.

ఎవరు వచ్చింది... అని అడిగిన భర్తతో విషయమంతా చెప్పింది.

"ఆ తల్లీ కొడుకులిద్దరూ మనింట్లోనా? ఛీ..ఛీ.. వాళ్ల అవతారం చూస్తుంటేనే అసహ్యమేస్తుంది. మనింట్లో ఉందంటే రోజూ దాని మొహం చూడగానే మన పాపకి పాలిచ్చిన సంగతి గుర్తొచ్చి ఒళ్లంతా కంపరం కలుగుతుంది. అప్పుడంటే ఏదో పరిస్థితులు అట్లా వచ్చిపడ్డాయి కాబట్టి తప్పులేదు. ఇప్పుడామెని పన్లో పెట్టుకున్నామంటే పాప ఏడిస్తే ఇప్పుడు కూడా పాలిచ్చినా ఇస్తుంది. ఎందుకొచ్చిన తలకాయనొప్పి. ఎంతో కొంత డబ్బిచ్చి నీ పాత చీరలుంటే ఇచ్చి ఏదో ఒకటి చెప్పి పంపేయ్"

"సర్లేండి.. నేనూ అదే అనుకొంటున్నాను. ఈ దరిద్రాన్ని మనమెక్కడ భరిస్తాం"

బుడిబుడి అడుగులేస్తూ సందులోకెళ్లిన పసివాడ్ని ఎత్తుకుందామని వెళ్లిన ముత్యాలుకి కిటికీలో నుండి వాళ్ల మాటలు వినిపించటంతో నివ్వెరపోయింది. పరిస్థితుల్ని బట్టి మనుషులెలా మారతారో తెలుసుకోలేని ఆ అమాయకురాలికి వాళ్ల మాటలు ఎంతగానో బాధించాయి. తెలియకుండానే కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

'నా బిడ్డ పాలకోసం ఏడ్చిఏడ్చి ఏమైపోతుందోనని భయంతో తల్లడిల్లిపోయాను. మా అదృష్టం కొలది ఇంత మంది జనంలో పాలిచ్చే తల్లిని నువ్వొకదానివున్నావు. నువ్వే కనక లేకపోతే ఈ రోజు మా పాప మాకు దక్కేది కాదు. నా పాప ప్రాణాలు నిలపటానికి నీ బిడ్డని కూడా అర్థాకలితో పస్తుంచావు. నిజంగా.. ఏమిచ్చినా నీ ఋణం తీర్చుకోలేము ముత్యాలూ! జన్మ జన్మలకి నీకు ఋణపడి ఉంటాము' కన్నీళ్లతో తన చేతులు పట్టుకొని వెళ్లే రోజు వాళ్లన్న మాటలు గుర్తొచ్చాయి.

అప్పుడట్టా దేవతని చేసి మాట్టాడిన ఆయమ్మ, బాబుగారేనా ఇప్పుడిట్టా అసయ్యించుకుంటున్నది.. నేనేదో కట్టం చేసుకొని కడుపునింపుకుందామని వచ్చాను కానీ వీళ్ల ఇల్లనుకొని ఈళ్లిచ్చే డబ్బుకో, పాత చీరలకో ఆశపడి రాలేదు. కట్టం చేసుకొని బతికేవోళ్లకి ఈ ఇల్లు కాకపోతే ఇంకోటి. నా మొగం చూత్తంటేనే ఛీ... అనిపించే చోట నాకేం పని.. నా గురించట్టా చీదరింపుగా మాట్టాడకుండా పనేమి లేదని చెప్పినా ఇంత బాధ ఉండేది కాదు. ఈ గొప్పోరు అంతా ఇంతే.. అవసరాన్ని బట్టి ఊసరెల్లిలా మారతారు..ఓ చేత్తో పిల్లాడ్ని చంకనేసుకొని రెండో చేత్తో కన్నీరు తుడుచుకుంటూ వెనక నుండి రజని పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్లిపోయింది పాపం... ముత్యాలు.



# ప్రియాంక నిర్వచనం

సైలెంట్‌గా తనదైన స్టయిల్‌తో బాలీవుడ్‌లో బిజీబిజీగా వున్న ప్రియాంకా చోప్రా గురించి అడపాదడపా కొన్ని ప్రేమాయణాలు వినిస్తున్నా వాటిని తను పట్టించుకోనని చెబుతుంది. తాజాగా జాతీయ స్థాయిలో ఉత్తమ నటి అవార్డుని కొట్టేసిన ప్రియాంకని 'లవ్ గురించి ఏదైనా చెప్పండి' అని అడిగితే- 'ఏదైనా ప్రేమ వ్యవహారం సరిగ్గా పండకపోతే మనసు కూడా గాయపడుతుంది. ఫ్రెండ్‌గా వున్న వ్యక్తి లవర్‌గా మారగలడేమోగానీ, లవర్ మాత్రం ఫ్రెండ్ కాలేడు' అంటూ తనదైన నిర్వచనాన్ని ఇస్తుంది ప్రియాంక.